



# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
మన దునియా
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 243 | ఏప్రిల్ 30 గురువారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-





## వివరాలు

**మన దునియా,హనుమకొండ జిల్లా,కమలాపురం: ఏప్రిల్ 29**

హనుమకొండ జిల్లా కమలాపురం ప్రాంతంలో కల్తీ దందా రోజు రోజుకు రెచ్చిపోతూ విస్తరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. గ్రామాల నుంచి పట్టణాల వరకు చాపకింద నీరులా వ్యాపిస్తున్న ఈ అక్రమ వ్యాపారం ప్రజల ఆరోగ్యానికే కాదు, చట్టవ్యవస్థకూ సవాలుగా మారింది. ముఖ్యంగా కల్తీ మద్యం, నకిలీ ఉత్పత్తుల రూపంలో ఈ దందా బలపడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

**అడ్డుకట్ట ఎక్కడ?**

అధికారుల కళ్ల ముందే ఈ దందా సాగుతున్నా, చర్యలు మాత్రం కనిపించడం లేదు అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడప్పుడు దాడులు, సీజ్‌లు జరుగుతున్నా, అవి కేవలం పైపూత చర్యలుగానే మిగిలిపోతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన సూత్రధారులు మాత్రం పట్టుబడకుండా తప్పించుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బెల్ట్ దందా జోరుగా**

లైసెన్స్ ఉన్న షాపులే కాకుండా, అనధికారంగా 'బెల్ట్ షాపులు' విస్తరించడం కల్తీ మద్యం వ్యాపారానికి మరింత బలం ఇస్తోంది. తక్కువ ధరకు అందుతున్నందున ప్రజలు తెలియకుండానే ఈ మత్తు వలలో పడుతున్నారని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. దీంతో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి.

**ఆరోగ్యంపై ప్రభావం**

కల్తీ ఉత్పత్తుల వాడకం వల్ల ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కల్తీ మద్యం కారణంగా ప్రాణాపాయం కలిగే ప్రమాదం ఉన్నా, అవగాహన లోపం, తక్కువ ధర ఆకర్షణ వల్ల వినియోగం తగ్గడం లేదు.

**అధికారుల పాత్రపై అనుమానాలు**

ఈ దందా ఇంత విస్తృతంగా సాగుతున్నా, నియంత్రణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారుల నిర్లక్ష్యం,


(మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణలో ఉద్యోగులకు రూ.1000 కోట్ల బకాయిల విడుదల

**మన దునియా,హైదరాబాద్, ఏప్రిల్ 29**

తెలంగాణలో ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. బుధవారం ఆర్థికశాఖ రూ.1000 కోట్లను రిలీజ్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను సర్కార్ చెల్లించింది. దీంతో 2025 అక్టోబర్ వరకు బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసింది. గతంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ప్రతి నెల ఉద్యోగుల బకాయిల కోసం ప్రభుత్వం రూ.700 కోట్ల



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## తెలంగాణలో ఉద్యోగులకు రూ.1000 కోట్ల బకాయిల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

చొప్పున చెల్లిస్తూ వస్తోంది. ఈనెల(ఏప్రిల్) బకాయిల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచింది. మిగిలిన ఉద్యోగులకు సంబంధించి త్వరలోనే నెలకు వెయ్యి కోట్ల చెప్పున విడుదల చేస్తూ బకాయిలన్నింటీని క్లియర్ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఉద్యోగుల మెడికల్ బిల్లులను కూడా ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా ప్రభుత్వం చెల్లిస్తోంది..

## రేవంత్ రెడ్డికి నాకు వ్యక్తిగత పంచాయతీ లేదు: కేటీఆర్


**మన దునియా హైదరాబాద్,ఏప్రిల్ 29**



అధికారం ఎవరికీ శాశ్వతం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 'అధికారం రావడం, పోవడం రొటీన్‌గా జరిగేదే. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. కానీ.. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించాలి. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతో పాటు.. బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయి. అధికారం మనకేమీ కొత్త కాదు' అని మాజీ మంత్రి అన్నారు.గత ఎన్నికల సమయంలో ప్రజలకు కేసీఆర్ చిలుకకు చెప్పినట్లు చెప్పారని.. తొందరపడవద్దని, ఆగమై ఓటు వేయొద్దని అన్నారని మాజీ మంత్రి తెలిపారు. రేవంత్ రెడ్డికి.. తనకు వ్యక్తిగత పంచాయతీ లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు కల్వకుర్తిలో సర్వే చేయించామని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఓడిపోతారని క్లియర్‌గా చెప్పారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నారు కాబట్టి అధికార మార్పిడి కావాలని చాలామంది చెప్పారని తెలిపారు. 2023 తర్వాత బీఆర్ఎస్‌కు చాలా షాక్‌లు తగిలాయన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. కేసీఆర్‌కు రెండోసారి ఫ్రాక్చర్ జరిగింది. మన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారి వెళ్లిపోయారు' అని కేటీఆర్ తెలిపారు.గతంలో కేసీఆర్ రైతుబంధు ఇస్తుంటే.. ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా అని? పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధును కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని గుర్తుచేశారు. కానీ.. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలన్నారు. చాలా నియోజకవర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు.. ఈ ఎమ్మెల్యే తమకొద్దని అనుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని కేటీఆర్ వెల్లడించారు..

## కల్తీ దందాకు రెక్కలు...!?

(మొదటి పేజీ తరువాయి)



మరికొందరి మౌన సహకారం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ముగింపు**

కల్తీ దందా పెరుగుదలపై కఠిన చర్యలు తీసుకోకపోతే, ఇది మరింత విస్తరించే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణాలతో ఆటలాడే ఈ అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, మూలాలను తుడిచివేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే "కల్తీ దందాకు రెక్కలు" అన్న మాట వాస్తవంగా మారిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఒక కానిస్టేబుళ్లు సస్పెండ్

**మన దునియా,హనుమకొండ,ఏప్రిల్ 29**

వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, డబ్బు ఇవ్వని వారి ఇంటిపై దాడికి పాల్పడినందుకుగాను ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యం. యాదగిరి సస్పెండ్ కాగా, హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో మద్యం సేవించి నైట్ ఇంచార్జి విధులు నిర్వహించినందుకు హెడ్ కానిస్టేబుల్ టి. రాములు సస్పెండ్ అయ్యారు. అలాగే స్టేషన్ అధికారి ఇచ్చిన ఆదేశాలను అతిక్రమిస్తున్నందుకు గాను చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు చెందిన ఓ సతీష్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.




# అడ్మిషన్ల వేటలో ప్రైవేట్ టీచర్లు





**ఎర్రటి ఎండల్లో ఇంటింటికి గాలింపు**
**స్కూల్ లలో 70% శాతం మహిళా టీచర్లే**
**పేరెంట్స్ నుంచి సంవత్సరం ఫీజు వసూలు**

**ఉమ్మడి,నిజామాబాద్ జిల్లా ప్రతినిధి,(ఏప్రిల్ 29):మన దునియా,:**

ఉదయం బడి గంట మోగగానే తరగతి గదిలో విద్యార్థులకు పుస్తకాలు, చాక్పీస్ పట్టుకుని నవ్వుతూ పాఠం చెప్పే ఆ టీచర్లను ప్రైవేట్ పాఠశాల యజమానులు అడ్మిషన్లను తీసుకురావాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు.ఉదయం బడి గంట మోగగానే తరగతి గదిలో విద్యార్థులకు పుస్తకాలు, చాక్పీస్ పట్టుకుని నవ్వుతూ పాఠం చెప్పే ఆ టీచర్లను ప్రైవేట్ పాఠశాల యజమానులు అడ్మిషన్లను తీసుకురావాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఎర్రటి ఎండలో ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ పాఠశాలలో విద్యార్థులు అడ్మిషన్లు చేసే విధంగా మాట్లాడి వివరాలు సేకరించాలని టీచర్లను యజమానులు ఆదేశిస్తున్నారు. ఈ పని చేయకపోతే జీతం కట్, ఉద్యోగం నుంచి తొలగిస్తామని బహిరంగంగానే బెదిరిస్తున్నారు. నందిపేట్, మోపాల్ ఆర్మూర్, బోధన్, మండలాల్లో జోరుగా అడ్మిషన్ల వేట.

**ఆత్మ గౌరవం కరువు..**

"సార్" అని పిలిపించుకోవాల్సిన వారు ఇప్పుడు అడ్మిషన్ల కోసం ఎర్రటి ఎండలో వీధి వీధికి, ఇంటింటికీ తిరుగుతున్నారు. మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారు ? మా పాఠశాలలో అడ్మిషన్ చేయించండి అని అడుగుతూ గుమ్మం ముందు తలవంచుకుని నిలబడుతున్నారు. యాజమానులు పెట్టిన టార్గెట్ చేరకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తారు అని తమ ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేస్తున్నారు. నవీపేట్, నందిపేట్ మోపాల్ ఆర్మూర్ బోధన్, మండలాల్లో కామారెడ్డి జిల్లాలోనూ వందలాది స్కూళ్లలో వేలాది మంది టీచర్లు ఇదే బాధను అనుభవిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో ప్రైవేటు టీచర్లు గొంతెత్తలేని పరిస్థితి.

**కనిపించని టీచర్ల శ్రమ**

రాష్ట్రంలో 12 వేల ప్రైవేట్ స్కూళ్లలో 3 లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారు. అందులో 70% మం మహిళలే. పొద్దున 8 గంటలకు స్కూల్కు వస్తే రాత్రి 6,7 వరకు పని. జీతం నెలకు పదివేల లోపు మాత్రమే. అరకొర జీతాలతో పనిచేస్తున్నా సమయానికి డబ్బులు ఇవ్వని యజమానులు. ఈఎస్ఐ లేదు, పీఎఫ్ లేదు, జాబ్ సెక్యూరిటీ అస లేదు. ప్రభుత్వం కల్పించిన కార్మిక చట్టం ప్రకారం ప్రతి ఉద్యోగికి వారానికి ఒక రోజు తప్పనిసరి సెలవు ఇవ్వాలి. అది కూడా సక్రమంగా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఏదో ఒక కారణంతో పని చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరెంట్స్ దగ్గర 12 నెలల ఫీజు వసూలు చేసే యాజమానులు, టీచర్లకు మాత్రం 10 నెలల జీతమే ఇస్తున్నారు. మిగతా రెండు నెలలు ఖాళీగా కూర్చోవాలి లేదా అడ్మిషన్ల కోసం తిరగాలి.


**మాట్లాడితే ముప్పు**

తమ సమస్యల పై నోరు విప్పితే మరుసటి రోజు గేటు పాస్ చేతిలో పెడతారేమోనన్న భయం. అందుకే అంతా మౌనంగా భరిస్తున్నారు. కుటుంబాన్ని పోషించుకోవడానికి, పిల్లల్ని చదివించుకోవడానికి ఈ అవమానాలను దిగమింగుతున్నారు. మేమూ మనుషులమే. మాకు ఆత్మగౌరవం ఉంటుంది. ప్రభుత్వం మా వైపు కూడా చూడాలి అనేది వారి మౌన వేదన.

## మోదీని కలిస్తే బీజేపీలో చేరుతున్నట్లా?: మీడియా ప్రతినిధుల ప్రశ్నకు మల్లారెడ్డి అసహనం

"మీరు బీజేపీలో చేరుతున్నారా" అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బీఆర్ఎస్ నాయకుడు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసేందుకు వెళితే బీజేపీలో చేరుతున్నట్లా? అని అసహనం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ యువ నాయకుడు టింకు గౌడ్ ఆధ్వర్యంలో బోయినపల్లిలో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ఆయనను చుట్టుమట్టి, మీరు ప్రధాని మోదీని కలవడంతో బీజేపీలోకి వెళతారనే హాట్ టాపిక్ నడుస్తోంది కదా, మీరేమంటారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు .మల్లారెడ్డి స్పందిస్తూ, అది హాట్ టాపిక్ ఏమిటి, ప్రధానిని కలిస్తే బీజేపీలో చేరుతారా, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారానికి తాను స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. బయట జరిగే ప్రచారంతో తనకు సంబంధం లేదని అన్నారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు.

## కవితకు 'టీఆర్ఎస్' షాక్.. పార్టీ పేరును రిజిస్టర్ చేయవద్దని ఈసీకి లేఖ!



తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కవితకు తెలంగాణ రాజ్య సమితి (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షుడు తుపాకుల బాలరంగం షాకిచ్చారు. కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారడంతో బాలరంగం తన పార్టీని 2023లో రిజిస్టర్ చేయించారు. ఈ నేపథ్యంలో కవిత 'టీఆర్ఎస్' పార్టీని రిజిస్టర్ చేయవద్దని, అలా చేస్తే తన పార్టీకి నష్టం జరుగుతుందని ఎన్నికల సంఘానికి లేఖ రాశారు.తన టీఆర్ఎస్ పార్టీని ఎన్నికల సంఘం 2023లో రిజిస్టర్ చేసినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్యాస్ సిలిండర్ గుర్తుతో పది నియోజకవర్గాల్లో పోటీ చేసినట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన తుపాకుల బాలరంగం 'టీఆర్ఎస్' సంక్షిప్త నామంతో పార్టీని స్థాపించారు. బహుజనులకు రాజ్యాధికారం లక్ష్యంగా పార్టీని స్థాపించారు.కవిత నాలుగు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. పాతికేళ్ల క్రితం కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ సంక్షిప్త నామం వచ్చేలా ఆమె పార్టీని ప్రకటించారు.

## మోదీ హైదరాబాద్ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం



మే 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటంచనున్నారు. కేంద్రంలో మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని తొలిసారిగా తెలంగాణకు వస్తుండటంతో, దీనిని ఒక చారిత్రాత్మక విజయ సంకేతంగా మలిచేందుకు రాష్ట్ర బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది.సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా రాష్ట్ర బీజేపీ నేతలు నామకరణం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, విపక్ష బీఆర్ఎస్ వైఫల్యాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను (ఆగ్రహాన్ని) ఓట్లుగా మలుచుకోవాలన్నది బీజేపీ ఉద్దేశ్యం.ఈ సభను రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా నిర్వహించేందుకు బీజేపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. సుమారు 3 లక్షల మందిని సభకు తరలించడం ద్వారా అటు కాంగ్రెస్‌కు, ఇటు బీఆర్ఎస్‌కు తమ బలాన్ని చాటాలని భావిస్తున్నారు. మరోవైపు, కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, నేషనల్ హైవేల విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం ద్వారా 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఆవశ్యకతను ప్రధాని నొక్కి చెప్పనున్నారు.జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో పట్టు సాధించేందుకు మోదీ పర్యటనను ఒక గొప్ప అవకాశంగా వాడుకోవాలని కమలనాథులు భావిస్తున్నారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని ప్రస్తావించడం ద్వారా మహిళా ఓటర్లను ఆకర్షించే అవకాశం ఉంది.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# ప్రాణాలు పోతున్నా ఇటు చూడరా..?

**ఎక్లాస్ ఖాన్ పేటలో రోడ్డు డివైడర్ తో పొంచి ఉన్న ముప్పు**
**ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి**
**గతంలో ప్రాణాలు కోల్పోయిన నారాయణ సెట్**
**ప్రాణాలు పోతున్నాయని అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు**

**మన దునియా కేశంపేట ఎక్లాస్ ఖాన్ పేట:ఏప్రిల్ 29**

కేశంపేట మండలం ఎక్లాస్ ఖాన్ పేట గ్రామంలో ముఖ్య రహదారిపై వేసిన డివైడర్ ప్రజల ప్రాణాలను తోడేస్తోంది. ఇప్పటికే ఈ డివైడర్ కారణంగా ఇద్దరు వ్యక్తులు గ్రామంలో చనిపోయారనీ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా గ్రామానికి చెందిన దాసరి సత్యమ్మ అనే మహిళ రోడ్డు డివైడర్ కారణంగా ఆర్టిసి బస్సు ఢీకొని దుర్మరణం చెందడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై గ్రామం మధ్య ఇరకాటంగా నిర్మించిన ఈ డివైడర్ కారణంగా గతంలో కూడా అనేక సందర్భాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఎవరు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. గ్రామానికి చెందిన నారాయణసెట్ కూడా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. రోడ్డు దాటడానికి ఎంతో కష్టంగా మారుతుందని గ్రామస్తులు అంటున్నారు. రోడ్డుపై ఇరకాటంగా రెండు వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొందని అయినప్పటికీ ఈ డివైడర్ తొలగించకుండా అలాగే కొనసాగించడం అధికారులకు ఏలాంటి లాభాలు తెచ్చిపెడుతుందని గ్రామస్తులు వెటకారంగా ప్రశ్నిస్తున్నారు. అనుకూలంగా లేని చోట డివైడర్ పెద్దగా నిర్మించి రోడ్డును ఇబ్బందుల పాలు చేస్తుంటే అధికారులకు కనిపించడం లేదా అని గ్రామస్తులు అంటున్నారు. దాసరి సత్తెమ్మ దుర్మరణంతో గ్రామంలో డివైడర్ నిర్మించిన తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు నెలకొన్నాయి. వెంటనే డివైడర్ కూల్చివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు అధికారులు పూనుకుంటారా లేక గ్రామస్తులే శ్రమదానంతో డివైడర్ను తొలగించాలా అని ప్రశ్నిస్తున్నారు..



# రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి కోసం మంత్రి కీలక ఆదేశాలు

**మన దునియా,హైదరాబాద్, ఏప్రిల్ 29**




రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావాలని ఉన్నతాధికారులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన పర్యాటక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త శోభను తీసుకొచ్చేందుకు పలు అంశాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చించారు. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఏడాది చివరిలో నవంబర్ లేదా డిసెంబర్‌లో వీటిని నిర్వహించేందుకు ప్లాన్ చేయాలని సూచించారు.రాష్ట్రంలోని కీలక పర్యాటక కేంద్రాల్లో వారాంతంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. సోమశిల, రామప్ప, యాదాద్రి ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. గోల్కొండ, తారామతి బరాదరిలలో జరుగుతున్న పనులపై ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్షించారు. పర్యాటక ప్రాంతాల్లో కనీస సౌకర్యాల ఏర్పాట్లపై రాజీ లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు.మరుగుదొడ్లు, టెంట్లు, గ్లాస్ హౌస్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. రహదారి పక్కన విశ్రాంతి కేంద్రాలు అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ప్రతి టూరిజం ప్రాజెక్ట్‌కు నోడల్ అధికారులను నియమించాలన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమన్వయంతో నగరాన్ని సుందరీకరిస్తామని తెలిపారు. స్కైవాక్‌లు, శిల్పాలతో హైదరాబాద్‌కు కొత్త ఆకర్షణ తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.తెలంగాణను వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. మెడికల్, వెల్నెస్, గోల్ఫ్, ఫిలిం టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మధ్య ప్రాచ్య దేశాల్లో తెలంగాణ టూరిజంపై ప్రచారం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. చైనా, వియత్నాం టూరిజం మోడళ్ల గురించి అధ్యయన యాత్రలపై ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. వరంగల్, సోమశిలలో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్ల ప్రతిపాదనలు వచ్చాయని మంత్రి జూపల్లి చెప్పారు. రామప్ప దేవాలయం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాజెక్టులకు నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు..

# జర్నలిస్ట్ హత్య అత్యంత దారుణం - రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షులు మేడా శ్రీనివాస్

**జర్నలిస్టులకు ప్రభుత్వాలు పూర్తి భద్రత కల్పించాలి**
**ర్నలిస్ట్ భద్రత కోసం పటిష్టమైన చట్టాలు రూపొంచాలి**
**జర్నలిస్ట్ మీద చేయి వేయాలంటేనే భయపడేలా చట్టం రూపొందించాలి**

**మన దునియా,అమరావతి:-చిత్తూరు జిల్లా,వి.కోట:ఏప్రిల్ 29**

అమరావతి:–చిత్తూరు జిల్లా వి.కోటలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్య అత్యంత దారుణమని, ఈ ఘటన ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా నిలుస్తోందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షులు మేడా తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా పిలువబడే జర్నలిజం రోజురోజుకీ తన స్వేచ్ఛను కోల్పోతూ ప్రమాదంలో పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, హత్యలు జరుగుతున్నాయి అనడం అత్యంత ఆందోళనకరమని తెలిపారు.జగన్మోహన్ రెడ్డి హత్యను కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా కాకుండా, నిజాన్ని వెలికితీసే మీడియా స్వేచ్ఛపై జరిగిన దాడిగా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరంగా కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని కోరారు.అదే విధంగా జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మీడియా ప్రతినిధులు భయపడకుండా తమ విధులు నిర్వహించేలా అనుకూల వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.జర్నలిజం స్వేచ్ఛను కాపాడటం ప్రతి ప్రభుత్వానికి బాధ్యత అని, లేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉందని మేడా హెచ్చరించారు.ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిన జర్నలిజం రోజురోజుకీ ప్రమాదంలో పడుతోందని, నిజాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న హింసాత్మక ఘటనలను కట్టడి చేయడానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులకు ప్రభుత్వాలు పూర్తి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, వారి విధుల నిర్వహణలో ఎటువంటి ఆటంకాలు లేకుండా రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. జర్నలిస్టుల భద్రత కోసం పటిష్టమైన చట్టాలు రూపకల్పన చేయాలని, జర్నలిస్ట్‌పై చేయి వేయాలంటేనే భయపడేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.



# భార్యను హత్య చేసి డ్రామా ఆడిన భర్త లేఖతో బట్టబయలైన దారుణం సూరత్‌లో సంచలనం

**మన దునియా గుజరాత్,సూరత్: ఏప్రిల్ 29**




గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నగరంలో భార్యను హత్య చేసి, తరువాత ఆమె కనిపించడంలేదని డ్రామా ఆడిన భర్త చర్యలు సంచలనంగా మారాయి. మైనర్ కుమారుడికి దొరికిన ఒక లేఖతో ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సూరత్‌లోని సలబత్‌పురా పరిధికి చెందిన విశాల్ సాల్వి (40) తన భార్య శిల్ప సాల్వి (39)ను హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. శిల్ప వృత్తిరీత్యా డైటీషియన్‌గా పనిచేస్తోంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటం, అనుమానం పెరగడం ఈ హత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.హత్య అనంతరం విశాల్ తన కుమారుడికి “నేను పెద్ద తప్పు చేశానుడ శిల్ప ఇక లేదు” అంటూ ఒక లేఖ రాశాడు. ఆ లేఖ మైనర్ కుమారుడికి దొరకడంతో విషయం బయటపడింది. ఇదే సమయంలో, ముందుగా తన భార్య కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసి నిందితుడు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు సమాచారం అందుకుని సలబత్‌పురా ప్రాంతంలోని ఒక పాడుబడిన ఇంటిని తనిఖీ చేయగా, అక్కడి నుంచి దుర్వాసన రావడంతో అనుమానం కలిగింది. వెంటనే తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి పరిశీలించగా, చెక్క పెట్టెలో మృతదేహాన్ని పెట్టి పచ్చి సిమెంట్‌తో కప్పి ఉంచినట్టు గుర్తించారు. దీంతో పోలీసులు శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిందితుడు విశాల్ సాల్వి పరారీలో ఉన్నాడు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

# టీఆర్ఎస్ పేరుపైనే కవిత పార్టీ పెట్టడం హాస్యాస్పదం: కోమటిరెడ్డి

**మన దునియా,యాదాద్రి,ఏప్రిల్ 29:**




టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవితపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కవిత పార్టీ పెట్టడం.. అది కూడా టీఆర్ఎస్ పేరు మీదనే పార్టీ పెట్టడం హాస్యాస్పదమన్నారు. కూతురికి తండ్రి అంటే ప్రేమ ఉండాలని.. కానీ కవిత తన మొదటి సమావేశంలో తండ్రిని తిట్టి మర్యాద పోగొట్టుకున్నారని అన్నారు. ఉద్యమకారుడు కేసీఆర్‌ను తిట్టడం తనకు బాధేసిందని తెలిపారు. కన్న తండ్రికే విలువ ఇవ్వని మనిషి.. ప్రజలకు ‘అమ్మ’ ఎలా అవుతుందని ప్రశ్నించారు. తన అన్న మీద ఉన్న కోపాన్ని తండ్రి మీద చూపడం తప్పన్నారు. మద్యం కుంభకోణంలో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని.. కేసు పూర్తి కాలేదని ఎమ్మెల్యే తెలిపారు. డబ్బులు ఉన్నాయని పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టేంత సులువైందన్నారు.

మంత్రి పదవిపై ...

మంత్రి పదవిపై అధిష్ఠానం తనకు హామీ ఇచ్చిందని... మాట నిలబెట్టుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్ విస్తరణ ఉండొచ్చని తెలిపారు. మంత్రి పదవి ఇస్తే మరింత కష్టపడి పనిచేస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు..

# ఏపీ రాష్ట్రవ్యాప్తంగా 33,012 ఎకరాలకు ఫ్రీహోల్డ్ జారీ చేసిన ప్రభుత్వం

**మన దునియా,అమరావతి: ఏప్రిల్ 28**

ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రామ సర్వీసు ఇనాం భూములను ఫ్రీహోల్డ్ చేస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.తాజాగా షరతు గల (కండీషనల్) పట్టా భూములను కూడా ఫ్రీహోల్డ్ చేసింది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15 జిల్లాల పరిధిలో 33,440.62 ఎకరాల కండీషనల్ పట్టా భూములు ఉంటే..వాటిలో 33,012.35 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో కండిషనల్ పట్టా ఉన్న భూముల్ని యజమానులు విక్రయించుకోవచ్చు....



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# పదో తరగతి ఫలితాలు విడుదల...

**సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థుల మార్కుల ప్రభంజనం..**

**మ్మడి,నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, మన దునియా :**



పదవ తరగతి ఫలితాలలో సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థిని కె. వైష్ణవి 544 మార్కులతో మండల ప్రథమ ర్యాంకు సాధించింది, మరో విద్యార్థి ఎస్. ప్రసన్న 527 మార్కులు సాధించారు. మొత్తం మీద పద్నాలుగు విద్యార్థులలో ఐదుగురు విద్యార్థులు 500 మార్కులకు పైగా స్కోర్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మండలంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మట్టిలో మాణిక్యాలు . నిరుపేదల్లో ఉన్నత శిఖరాలకి చేరుకోవాలని ఆయన కోరారు. తల్లిదండ్రులకు మరింత పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. మండలం పదవ తరగతి ఉత్తీర్ణత అయినటువంటి విద్యార్థుల అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

.. ఈ అద్భుతమైన విజయాన్ని కరస్పాండెంట్ దేవన్న , డైరెక్టర్ వంశీ మరియు ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ గుర్తించి, విద్యార్థులందరి కృషిని మరియు విజయాన్ని అభినందించారు. శని ఆవేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సప్లమెంటరీ ఎగ్జామ్స్ ప్రిపేర్ కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# పదిలో రామన్ స్కూల్స్ విద్యార్థుల ప్రభంజనం

**మన దునియా,హనుమకొండ: ఏప్రిల్ 29**




బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో, రామన్ విద్యార్థులు 100శాతం ఫలితాలను సాధించినట్లు రామన్ స్కూల్ కరస్పాండెంట్ రాజేష్ ఓ ప్రకటన లో తెలిపారు.

టాపర్ల వివరాలు:

కాసర్ల సిరి చందన 579 మార్కులు, జన్ను ఆశ్రిత 577 మార్కులు, నిద కొల్నాన్ 572 మార్కులు, వడైవల్లి రిష్విన్ 572, అల్లాడి నవనీత్ సాయి 570, కంబంపాటి లక్ష్మీసాయి 569, కాసిరెడ్డి అవినాష్ రెడ్డి 568, అక్కినపల్లి శ్రీనిధి 568, నాగిరెడ్డి హానిష్ 566, కుర్చియా బీనత్ 565, కొల్లా సాయిప్రజ్వల్ రెడ్డి 564, అనీమ్ 562 మార్కులను సాధించారు.

అత్యుత్తమ ప్రతిభ:

కాగా, 550 కి పైగా 19 మంది, మొత్తంగా 72 శాతం మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు.

యాజమాన్యం అభినందన:

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ కుమార్ డైరెక్టర్ పురుషోత్తం అభినందించారు. ప్రిన్సిపాల్ స్రవంతి , చంద్రప్రకాష్ , వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మరియు అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

# పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం

**మన దునియా ,శాయంపేట:ఏప్రిల్29:**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు జడ్పీ హెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థులు బాసని అన్విత 560/600. శివరాత్రి దీవెన 532/600, ఎండి రేష్మ 526/600 సాధించి పాఠశాల టాపర్లుగా మరియు మండల స్థానాలు కైవసం చేసుకున్నా రు. బాలికల పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించారు. టీ ఎస్ డబ్ల్యూఆర్ ఎస్ వర్ష హాసిని 581. కేజీబీవీ హర్షిత 568. అలాగే నవోదయ హై స్కూల్ కానుగుల నేత్ర 562 మార్కులు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థులు కలిసి క్రమశిక్షణ అంకితభావంతో అత్యుత్తమ ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సహకారంతో ఫలితాలు సాధించినట్లు తెలిపారు ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశా ల ప్రధానో పాధ్యాయు రాలు విద్యార్థులను అభినందించారు.



# తాళం వేసిన ఇంట్లో చోరీ ఎనిమిది తులాల బంగారం 12 లక్షల. చోరీ






**డిచ్పల్లి ఏప్రిల్ 29 మన దునియా: న్యూస్:**

డిచ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉదయం.11 గంటలకు డిచ్పల్లి మండలంలోని ఘన్పూర్ లో ఇస్లాంపుర లోని మహమ్మద్ అన్వర్,వాషి వెల్డింగ్ గ్యారేజ్ వ్యక్తి ఇంట్లో, తను తన భార్యతో పాటు బ్యాంకుకు వెళ్లిన సమయంలో, దొంగలు తాళం వేసిన ఇంట్లో గుర్తించి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 8 తులాల బంగారం, ఇరువై తులాల వెండి,12 లక్షల రూపాయలను గుర్తు తెలియని దొంగలు దొంగలించినట్లు డిచ్పల్లి ఎస్సై ఆరిఫ్ తెలిపారు దొంగలు అన్వర్ ఇంటికి వచ్చేలోపే పరారయ్యారని ఆయన తెలిపారు ఇట్టి విషయంలో మహమ్మద్ అన్వర్ దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ముమ్మారంగా చేస్తున్నమని ఆయన తెలిపారు

# ఏర్పాటు చేయాలి అన్ని డిమాండ్

మన దునియా, వాజేడు, ఏప్రిల్ 29

**సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



మేడే రోజున ప్రపంచ కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని మే ఒకటో తారీకున వాజేడు మండలంలో ఉపాధి హామీ పని చేస్తే కార్మికులందరికీ సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ సిపిఎం పార్టీ మండల కమిటీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి మాట్లాడుతూ మేడే రోజున ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కులు పని గంటలు సాధించు కున్న దినంగా. పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా కార్మికులు ఘనంగా మేడే ఉత్సవాలు జరుపుకుంటారని మే 1 న ఉపాధి కార్మికులకు పని కల్పించడం సరైనది కాదని మేడే కార్మికుల దినోత్సవంకి విరుద్ధం అనివారు అన్నారు దాని వలన ప్రపంచ కార్మిక దినోత్సవం యొక్క ప్రాధాన్యత తగ్గుతుందని వారు మాట్లాడుతూ అందువలన మేడేకు కార్మికులకు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు ఉపాధి పని ప్రదేశాలలో మంచినీరు విశ్రాంతి

**తీసుకున్నప్పుడు టెంటు ఏర్పాటు చేయాలని అన్నారు .**

ఉపాధి హామీ పని జరిగే ప్రదేశాలలో సరైన వసతులు లేని కారణంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధి కూలీలు ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడకుండా మంచినీరు సౌకర్యం ఉంటూ ఇతర వసతులు ఏర్పాటు చేయాలి కోరారు మండలం లోని ఏ పని ప్రదేశంలో కూడా ఏర్పాట్లు చేయడం లేదంటే బంగా మా దృష్టికి కార్మికులు తీసుకువచ్చారని ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు పెండింగ్ లో ఉన్న ఉపాధి బిల్లులు కూడా మంజూరు చేయాలని కొన్ని నెలలుగా పుణ్యంలో ఉండడం వలన కార్మికులు ఇబ్బందులు పడు తున్న వారు మాట్లాడుతూ అన్నారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు బచ్చల కృష్ణబాబు నరేష్ మహేందర్ పాల్గొన్నారు

# పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో స్పైన్ విద్యార్థుల ప్రభంజనం...

**మన దునియా,హనుమకొండ: ఏప్రిల్ 29**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్పైన్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని స్పైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ వెల్లడించారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు వారి ఉన్నతికి శ్రమించిన అధ్యాపకులను ఈ సందర్భంగా అభినందించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో మొత్తం 600 మార్కులకు గాను ఏ. అక్షర – 588 మార్కులు సాధించగా, యల్. రేవంత్, ఎండ్. అభ్రోత్ – 586 మార్కులు, సమీరా నయూమ్ – 585 మార్కులు, వెల్దండి సీమ, జి. సంహిత, కే. సుమిత్ – 584 మార్కులు, టి. హసిని, ఏ. ప్రశాంతి, ఏ. సుశాంత్, సిహెచ్.సిరి – 583 మార్కులు, వి. జాహ్నవి, మార్కు.క్రిథన్ – 582 మార్కులు, ఏ. హర్షిని – 581, పి.యతిన్, పి.హర్షిత – 580 మార్కులు సాధించినట్లు స్పైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ వెల్లడించారు.

302 మంది 85 శాతం కు పైగా:

302 విద్యార్థులు 85 శాతం కు పైగా విద్యార్థులు మార్కో్ల సాధించడం గర్వకారణం అని చెప్పుకొచ్చారు. ఐఐటీ ఫౌండేషన్, నీట్‌తో పాటు పదవ తరగతి పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో కూడా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని అవరోధించారని గర్వంగా చెప్పారు.ఈ కార్యక్రమశీ లో , కరెస్పాండెంట్ మూగల రమ , ఎర్రగట్టుగుట్ట బ్రాంచ్ సెక్రటరీ – జక్కుల శ్రీనివాస్ యాదవ్, ఐఐటీ కోఆర్డినేటర్ – మూగల రమేష్ యాదవ్, ప్రిన్సిపల్స్ – పి. నిశాల్, కె.దినేష్, రాజకుమార్, కవిత, ప్రగతిరెడ్డి, సవితా, మానస మరియు కాలేజీ ప్రిన్సిపల్స్ – రాజగౌడ్, పి. శ్రీనివాస్ ఉపాధ్యాయబృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం



# వాజేడు మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం





**మన దునియా వాజేడు ఏప్రిల్ 29**

వాజేడు మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో 29-04-2026 నా వచ్చిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పదవ తరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనపరిచినారు వాజేడు మండలంలోని మొత్తం 128 విద్యార్థులలో 127 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 127 మంది ఉత్తీర్ణులై 99.2% రావడం జరిగింది వాజెడు మండలం పదవ తరగతి విద్యార్థుల్లో 547 జడ్పీహెచ్ఎస్ వాజేడు విద్యార్థి మండా రిషిత్ ప్రథమ స్థానం. రెండవ స్థానం 544 మార్కులతో ఏ జి హెచ్ ఎస్ పెద్ద గొల్లగూడెం విద్యార్థిని మోదం వైష్ణవి మూడో స్థానం కేశ బోయిన అంజలి 542 మార్కులతో జడ్పీహెచ్ఎస్ వాజేడు నాగారం విద్యార్థిని ప్రతిభను కనపరిచినారు వాజేడు మండలంలో పదో తరగతి పరీక్ష రాసిన 127 మంది విద్యార్థులలో 58 మంది విద్యార్థులకు 500 పైబడిన మార్కులు రావడం గమనార్వం మొదటి మూడు స్థానాలు వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు వాజేడు మండల విద్యాఆధికారి టి వెంకటేశ్వర్లు అభినందించడం జరిగింది

# పది ఫెయిల్ అయ్యామని తొందరపాటు నిర్ణయాలు తీసుకోకండి: జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

**అన్నమయ్య జిల్లా మదనపల్లె....**

రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఉదయం 10వ తరగతి పరీక్ష ఫలితాలు వెలువడనున్నాయి. విజయాలు, అపజయాలు అనేవి మానవ జీవితంలో సహజం. ఫెయిల్ అయిన విద్యార్థులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచించారు. బుధవారం మదనపల్లి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ.. పది పాసైన, ఫెయిల్ అయిన విద్యార్థులు ఎవరు అధైర్య పడవద్దన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులపట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించి వారిని ఓదార్చాలని తెలిపారు. పది తప్పుపోతే వెంటనే సప్లమెంటరి ఉందన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థుల మనసు నొప్పించే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులు ఎవరూ కూడా మాట్లాడవద్దన్నారు. అపజయం వెనుక విజయం దాగుంటుందని విద్యార్థులు వారి తల్లిదండ్రులు అందరూ తెలుసుకోవాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడుతుంటే వారికి ధైర్యం చెప్పి ఓదార్చాలన్నారు. జీవితం అమూల్యమైనదని ఎవరూ కూడా చేజేతులారా పాడు చేసుకోవద్దని ఈసారి కాకపోతే వచ్చే ఏడాది విజయం సాధించవచ్చని గుర్తు చేశారు.



# మహిళల భద్రతకు పెద్దపీట.. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడితే కఠిన చర్యలు -- డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

**మన దునియా,**

రౌడీషీటర్లపై ఉక్కుపాదం.. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి..పోలీసు అధికారులకు కర్నూల్ రేంజ్ డీఐజీ దిశానిర్దేశం.. అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయంలో పర్యటన, సమీక్షా సమావేశం.. జిల్లాలో మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారిపై నేరాలకు పాల్పడే వారి పట్ల ఎంతటి కఠినంగానైనా వ్యవహరించాలని కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మదనపల్లెలోని అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని (ఎస్పీ ఆఫీస్) సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తోకలిసి జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా మహిళలు, బాలికలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన పోస్టులు పెట్టేవారిపై డేగకన్ను వేయాలని, అలాంటి వారిని గుర్తించి కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. మహిళల నుండి వచ్చే ఫిర్యాదులపై ప్రతి అధికారీ తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలన్నారు. అదేవిధంగా, జిల్లాలోని పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, వారు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించవద్దని సూచించారు. ఇక పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల పట్ల స్పందిస్తూ.. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తగిన భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని, అలాగే ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి, మదనపల్లె డీఎస్పీ శ్రీమతి బి. పావని తో పాటు పలువురు సీఐలు, పాల్గొన్నారు.



# ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లతో పాటు ఒక కానిస్టేబుళ్ సస్పెండ్

**మన దునియా,వరంగల్: ఏప్రిల్ 29**

వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు పోలీస్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, డబ్బు ఇవ్వని వారి ఇంటి పై దాడికి పాల్పడినందుకు గాను ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యం. యాదగిరి సస్పెండ్ కాగా, హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో మద్యం సేవించి నైట్ ఇంచార్జి విధులు నిర్వహించినందుకు హెడ్ కానిస్టేబుల్ టి. రాములు సస్పెండ్ అయ్యారు. అలాగే స్టేషన్ అధికారి ఇచ్చిన ఆదేశాలను అతిక్రమిస్తున్నందుకు గాను చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు చెందిన ఓ రమేష్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు

# మిలీనియం స్కూల్‌కు గర్వకారణం

## ఎస్ ఎస్ సి ,ఫలితాల్లో రామ్ తేజా ప్రతిభా ధంకా

**మన దునియా ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం**



మిలీనియం స్కూల్‌లో ఎస్ఎస్సి,2026 ఫలితాల్లో విద్యార్థి మేకల రామ్ తేజా విశిష్ట ప్రతిభ కనబరిచి 572 మార్కులు సాధించి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చాడు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ శ్రీ మునిపట్ల తిరుపతి రెడ్డి ,రామ్ తేజాను పుష్ప గుచ్ఛం , శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. రామ్ తేజా విజయానికి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం కీలకమని ప్రశంసించారు. అలాగే ఈ ఏడాది గూజ2026 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, “విద్యార్థులు లక్ష్యసాధనలో క్రమశిక్షణ, కృషి, పట్టుదల ఎంతో అవసరం. రామ్ తేజా సాధించిన ఈ విజయము పాఠశాలకు గర్వకారణం. ఇలాంటి విజయాలు ఇతరులకు ప్రేరణగా నిలవాలి. ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల సమన్వయం వల్లనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు” అని పేర్కొన్నారు. అదనంగా, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన విద్యా సదుపాయాలను మరింత మెరుగుపరచడానికి సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.

# తెలంగాణ టీ-వాలెట్‌లో భారీ డేటా చోరీ కలకలం అధికారుల అప్రమత్తం, కీలక వ్యక్తి అరెస్ట్!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 29**

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వానికి చెందిన డిజిటల్ చెల్లింపుల వేదిక టీ-వాలెట్‌లో భారీ డేటా చోరీ ఘటన వెలుగులోకి రావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. యూజర్లకు సంబంధించిన సున్నితమైన సమాచారం, లావాదేవీల రికార్డులతో పాటు ప్రభుత్వానికి జమ చేయాల్సిన నిధులను సైతం దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. టీ-వాలెట్ నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై కేసు నమోదు చేయగా, దర్యాప్తు వేగవంతమైంది. ఒప్పంద గడువు ముగిసిన తర్వాత కూడా ఆ సంస్థ టీ-వాలెట్‌కు సంబంధించిన యూజర్ డేటా, ట్రాన్సాక్షన్ రికార్డులు, సోర్స్ కోడ్‌ను ప్రభుత్వానికి అప్పగించకుండా నిలిపివేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్ ఇండియా సంస్థ చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ శ్రీనివాసులును పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు సంస్థ సీఈవోతో పాటు ప్రాజెక్ట్ మేనేజర్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా టీ-వాలెట్ యూజర్ డేటాను ప్రైవేట్ యాప్‌కు మళ్లించే ప్రయత్నాలు జరిగినట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వ డిజిటల్ ఆస్తులైన డేటా, సోర్స్ కోడ్ బదిలీకి కావాలనే అడ్డంకులు సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రభుత్వం మరో సంస్థకు ప్రాజెక్ట్ హ్యాండోవర్ చేపట్టాలని నిర్ణయించగా, దానిని కూడా ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నట్లు ప్రాథమిక విచారణలో బయటపడినట్లు సమాచారం. ఈ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక డిజిటల్ సేవల భద్రతపై తీవ్ర ఆందోళనలకు దారితీసింది. పూర్తి స్థాయి విచారణ అనంతరం మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# సన్‌రైజర్స్‌తో మ్యాచ్.. టాస్ గెలిచిన ముంబై... ఇవాళ కూడా 'హిట్ మ్యాన్' లేదు!

**హైదరాబాద్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై**

**ముంబై జట్టులో నాలుగు కీలక మార్పులు.. డికాక్‌కు గాయం**

**రోహిత్ శర్మ కోలుకోవడానికి మరికొన్ని మ్యాచ్‌ల సమయం పడుతుందని హార్దిక్ వెల్లడి**

**సన్‌రైజర్స్ జట్టులోకి ట్రావిస్ హెడ్, హర్ష్ దూబే**

**తాము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నామన్న కెప్టెన్ కమిన్స్**

ఐపీఎల్ 2026లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముంబై జట్టులో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో, 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ పునరాగమనం మరింత ఆలస్యం కానుందని హార్దిక్ స్పష్టం చేశాడు.టాస్ గెలిచిన అనంతరం హార్దిక్ పాండ్యా మాట్లాడుతూ.. "మేం మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నాం. వాతావరణం చల్లగా, గాలిగా ఉంది. కాబట్టి మంచు ప్రభావం ఉంటుందని అనుకోవడం లేదు. మంచి స్కోరు సాధించడమే మా లక్ష్యం," అని తెలిపాడు. క్వింటన్ డికాక్‌కు మణికట్టు గాయం కావడంతో అతను ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని, రోహిత్ శర్మ పూర్తిగా కోలుకోవడానికి మరో రెండు మ్యాచ్‌ల సమయం పడుతుందని వెల్లడించాడు.మరోవైపు, సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మాట్లాడుతూ.. తాము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నామని, పిచ్‌పై కొద్దిగా పచ్చిదనం ఉన్నందున బౌలింగ్‌కు మొగ్గు చూపేవాళ్లమని చెప్పాడు. సన్‌రైజర్స్ జట్టులో ట్రావిస్ హెడ్, హర్ష్ దూబే తిరిగి జట్టులోకి వచ్చారు.సన్‌రైజర్స్ హైదరాబాద్: అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా, నితీష్ కుమార్ రెడ్డి, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), హర్ష్ దూబే, సాకిబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగే, ఎషాన్ మలింగ.

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: స్మరణ్ రవిచంద్రన్, అనికేత్ వర్మ, హర్షల్ పటేల్, శివాంగ్ కుమార్, లియామ్ లివింగ్‌స్టోన్.

ముంబై ఇండియన్స్: ర్యాన్ రికెల్టన్ (వికెట్ కీపర్), విల్ జాక్స్, నమన్ ధీర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రాబిన్ మింజ్, ట్రెంట్ బౌల్ట్, జస్‌ప్రీత్ బుమ్రా, అల్లా మహ్మద్ ఘజన్‌ఫర్, అశ్వని కుమార్.

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: రాజ్ అంగద్ బావా, శార్దూల్ ఠాకూర్, రఘు శర్మ, మయాంక్ రావత్, క్రిష్ భగత్.



# అతడి బ్యాటింగ్ సిసలైన సినిమా చూస్తున్నట్టే ఉంటుంది: పుజారా

**రాజస్థాన్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై పుజారా ప్రశంసలు**

**సూర్యవంశీ బ్యాటింగ్ ఒక సినిమా చూసినట్టు ఉంటుందని వ్యాఖ్య**

**పవర్‌ప్లేలో అతడి నిర్భయమైన ఆటే జట్టుకు కీలకం అన్న పుజారా**

**స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌ను కూడా కొనియాడిన వైనం**



రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై భారత మాజీ ఆటగాడు ఛటేశ్వర్ పుజారా ప్రశంసల వర్షం కురిపించాడు. అతడి బ్యాటింగ్ చూస్తుంటే ఒక సినిమా చూసిన అనుభూతి కలుగుతుందని పుజారా అభివర్ణించాడు. పంజాబ్ కింగ్స్‌తో గతరాత్రి జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో గెలిచిన నేపథ్యంలో పుజారా ఈ వ్యాఖ్యలు చేశాడు.ఈ మ్యాచ్‌లో 223 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సూర్యవంశీ కేవలం 16 బంతుల్లో 43 పరుగులు చేసి రాజస్థాన్‌కు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ పుజారా దీనిపై స్పందించాడు. "వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ చేయడం ఒక సినిమాటిక్ అనుభవం. అతడు ఏ బౌలర్‌కైనా భయం లేకుండా ఎదురెళ్లే తీరు అద్భుతం. బంతిని చూసి, దానిని బాదడమే అతడికి తెలుసు. పవర్‌ప్లేలో అతడి దూకుడైన ఆటతీరే జట్టుకు తిరుగులేని ఆధిక్యాన్ని ఇస్తోంది" అని పుజారా వివరించాడు.ఇదే సమయంలో, మధ్య ఓవర్లలో రాణించిన స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌ను కూడా పుజారా మెచ్చుకున్నాడు. "పరుగులు ఇచ్చినా చాహల్ ధైర్యంగా బంతులు వేసి వికెట్లు తీయడానికి ప్రయత్నించాడు. అతడి వైవిధ్యమైన బౌలింగ్ అద్భుతం. స్పీడ్‌లో మార్పులు చేస్తూ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు," అని తెలిపారు.ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి పంజాబ్‌కు సీజన్‌లో తొలి ఓటమిని రుచి చూపించింది.

# వైభవ్ సూర్యవంశీ విధ్వంసం.. అత్యంత వేగంగా 400 పరుగులు

**ఐపీఎల్‌లో అత్యంత వేగంగా 400 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ**

**ఆండ్రీ రసెల్, అభిషేక్ శర్మ రికార్డులను అధిగమించిన యువ కెరటం**

**పంజాబ్‌పై 16 బంతుల్లో 43 పరుగులతో రాజస్థాన్‌కు అదిరిపోయే ఆరంభం**

ఈ ఇన్నింగ్స్‌తో ఆరెంజ్ క్యాప్‌ను తిరిగి కైవసం చేసుకున్న వైభవ్

ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ రికార్డుల పరంపర కొనసాగిస్తున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఒకే సీజన్‌లో అత్యంత వేగంగా 400 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఘనతను కేవలం 167 బంతుల్లోనే అందుకోవడం విశేషం. ఈ క్రమంలో ఆండ్రీ రసెల్ (188 బంతులు), అభిషేక్ శర్మ (195 బంతులు) వంటి విధ్వంసకర ఆటగాళ్ల రికార్డులను అతను అధిగమించాడు.మంగళవారం (28న) పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ ఈ రికార్డును అందుకున్నాడు. 223 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కేవలం 16 బంతుల్లో 43 పరుగులు చేసి రాజస్థాన్‌కు అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అతడు ఔటయ్యేసరికి 4 ఓవర్లకే జట్టు స్కోరు 51 పరుగులకు చేరింది. వైభవ్ వేసిన ఈ బలమైన పునాదిపై యశస్వి జైస్వాల్ (27 బంతుల్లో 51) కూడా రాణించాడు. ఆ తర్వాత డొనోవన్ ఫెరీరా, శుభమ్ దూబే కీలక భాగస్వామ్యంతో రాజస్థాన్ 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ విజయంతో ఈ సీజన్‌లో పంజాబ్‌కు తొలి ఓటమిని రుచి చూపించింది. ఈ ఇన్నింగ్స్‌తో వైభవ్ ఆరెంజ్ క్యాప్‌ను తిరిగి దక్కించుకున్నాడు. మ్యాచ్ అనంతరం వైభవ్ బ్యాటింగ్‌పై అతని ఓపెనింగ్ పార్టనర్ యశస్వి జైస్వాల్ ప్రశంసలు కురిపించాడు. "అతడితో కలిసి బ్యాటింగ్ చేయడం అద్భుతంగా ఉంది. అతడు ఆడుతున్న తీరును మరో ఎండ్ నుంచి చూడటం చాలా ఆనందంగా ఉంది. వైభవ్ చాలా చిన్నవాడు, అతడి గురించి ఏమి చెప్పాలో కూడా నాకు తెలియడం లేదు" అని జైస్వాల్ వ్యాఖ్యానించాడు.



# భారత బౌలర్లంటే ద్వేషం.. పాకిస్థాన్ క్రికెటర్ తీవ్ర వ్యాఖ్యలు!

**భారత బౌలర్లంటే తనకు ద్వేషమని పాక్ క్రికెటర్ హసన్ నవాజ్ వ్యాఖ్య**

**టీమిండియాతో ఆడేటప్పుడు ప్రత్యేక ప్రేరణ కలుగుతుందని వెల్లడి**

**ఈ వ్యాఖ్యలపై ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల నుంచి ఆగ్రహం**

పాకిస్థాన్ క్రికెటర్ హసన్ నవాజ్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 సందర్భంగా ఒక స్థానిక న్యూస్ ఛానెల్‌తో మాట్లాడుతూ, భారత బౌలర్ల పట్ల తనకున్న అభిప్రాయాన్ని వివాదాస్పద రీతిలో వ్యక్తం చేశాడు. అతని మాటలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇంటర్వ్యూలో భాగంగా ఏ బౌలర్‌పై పరుగులు చేయడానికి ఇష్టపడతారని ప్రశ్నించగా, హసన్ నవాజ్ బదులిస్తూ.. "భారత్‌తో ఆడేటప్పుడు సహజంగానే అదనపు ప్రేరణ ఉంటుంది. వాళ్ల బౌలర్లపై దాడి చేయాలనే భావన కలుగుతుంది. నిజం చెప్పాలంటే వాళ్ల బౌలర్లందరినీ నేను ద్వేషిస్తాను. భవిష్యత్తులో అవకాశం వస్తే, కచ్చితంగా వాళ్ల బౌలింగ్‌పై దాడి చేయడానికి ప్రయత్నిస్తాం" అని సంచలన వ్యాఖ్యలు చేశాడు.అయితే, కేవలం బౌలర్ పేరు చూసి కాకుండా, మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆటతీరు ఉంటుందని హసన్ నవాజ్ వివరించాడు. "అవసరమైన రన్ రేట్ 10, 12 లేదా 15 పరుగుల చొప్పున ఉన్నప్పుడు, బౌలర్ ఎవరనేది చూడకుండా పరుగులు చేయడానికి ప్రయత్నిస్తాం. అంతా మ్యాచ్‌పై ఆధారపడి ఉంటుంది" అని అన్నాడు.భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మైదానంలోనే కాకుండా వెలుపల కూడా తీవ్రమైన పోటీ ఉంటుంది. 2013 నుంచి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగనప్పటికీ, ఐసీసీ టోర్నమెంట్లలో మాత్రమే తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లలో భారత్‌దే స్పష్టమైన ఆధిపత్యం కొనసాగుతోంది.2025లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హసన్ నవాజ్, ఇప్పటివరకు 25 టీ20 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీ (105 నాటౌట్), రెండు అర్ధసెంచరీలతో కలిపి 457 పరుగులు చేశాడు. అలాగే, 4 వన్డేలలో 56.50 సగటుతో 113 పరుగులు సాధించాడు. అతను చివరిసారిగా 2025 నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ తరఫున ఆడాడు. పీఎస్ఎల్ 2026లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరఫున 10 మ్యాచ్‌లలో 291 పరుగులు చేసినప్పటికీ, ఆ జట్టు కేవలం 3 విజయాలతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచి నిరాశపరిచింది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# లండన్ ప్రేమ కథతో ఆనంద్ దేవరకొండ 'ఎపిక్'.. టీజర్ వచ్చేసింది



**'బేబీ' హిట్ జోడీ మళ్లీ మ్యాజిక్**

**ఆదిత్య హాసన్ మార్క్ కామెడీ**

**యూకే నేపథ్యంలో సాగే ప్రేమకథ**

**ఆకట్టుకుంటున్న సినిమా టీజర్**

బేబీ' బ్లాక్ బస్టర్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. 'చ90ం: ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను మెప్పించిన ఆదిత్య హాసన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ టీజర్ బుధవారం విడుదలై ఆసక్తిని రేకెత్తిస్తోంది.'90ం' సిరీస్‌లో మెప్పించిన ఆదిత్య పాత్ర చుట్టూనే ఈ సినిమా కథ తిరుగుతుంది. మధ్యతరగతి కుటుంబంలో పెరిగిన ఆ యువకుడు ఇంటి సభ్యుల ఒత్తిడితో పైచదువుల కోసం యూకే వెళతాడు. అక్కడ వైష్ణవీ చైతన్యతో ప్రేమలో పడితే ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయనేది ఈ టీజర్‌లో చూపించారు. ఆనంద్ దేవరకొండ తన సహజ సిద్ధమైన నటనతో మధ్యతరగతి యువకుడిగా ఒదిగిపోయారు.పక్కా లోకల్ అబ్బాయి ఫారిన్ వెళితే పడే ఇబ్బందులను కామెడీగా చూపిస్తూనే, మరోవైపు ఎమోషనల్ లవ్ ట్రాక్‌ను కూడా ఆదిత్య హాసన్ టచ్ చేసినట్లు టీజర్‌ను బట్టి తెలుస్తోంది. యూకే నేపథ్యంలోని విజువల్స్ చాలా కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. ఆనంద్, వైష్ణవి మధ్య కెమిస్ట్రీ మరోసారి వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది. ఫస్ట్ సెమిస్టర్ అని టైటిల్‌లో ఉండటంతో ఇది యూత్, స్టూడెంట్స్ ఆడియన్స్‌ను టార్గెట్ చేసినట్లు స్పష్టమవుతోంది.

## డూప్స్ లేకుండా మన హీరోలు ఫైట్లు చేయరు.. 90 శాతం మంది అలాగే చేస్తున్నారు: రవిబాబు

విలక్షణ నటుడిగా, ప్రయోగాత్మక చిత్రాల దర్శకుడిగా తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రవిబాబు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన దర్శకత్వంలో రాబోతున్న కొత్త చిత్రం 'రేజర్' ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. టాలీవుడ్ స్టార్ హీరోల పనితీరు, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణపై తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం పెను దుమారం రేపుతున్నాయి.

డూప్స్ లేకుండా ఫైట్ చేయరు


ఒక ఇంటర్వ్యూలో రవిబాబు మాట్లాడుతూ… "మన టాలీవుడ్ ఇండస్ట్రీలో ఉన్న హీరోలలో 90 శాతం మంది స్వయంగా ఫైట్లు చేయరు. కేవలం డూప్స్ సహాయంతోనే యాక్షన్ సన్నివేశాలను పూర్తి చేస్తారు" అంటూ బాంబు పేల్చారు. తెలుగు సినిమాల్లోని యాక్షన్ ఘట్టాలు వాస్తవికతకు ఆమడ దూరంలో ఉంటాయని, వాటిలో ఎలాంటి లాజిక్ ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. "కావలసినంత సమయం, డబ్బు ఇస్తే ఎలాంటి వెధవ అయినా ఇక్కడ సినిమా చేయగలడు" అంటూ ఘాటైన విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలు నేరుగా హీరోల సామర్థ్యాన్ని, పరిశ్రమలోని పోకడలను ప్రశ్నించేలా ఉన్నాయి.

మిస్టరీని చంపేస్తున్న సోషల్ మీడియా

ప్రస్తుత సినిమా నిర్మాణ శైలిపైనా రవిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా కారణంగా సినిమాలకు సంబంధించిన మిస్టరీ పూర్తిగా కనుమరుగైపోతోందన్నారు. "సినిమా విడుదల కాకముందే లీకులు వచ్చేస్తున్నాయి. పబ్లిసిటీ పేరుతో ప్రతి చిన్న విషయాన్ని బయటపెట్టడం వల్ల సినిమాపై ప్రేక్షకుడికి ఉండాల్సిన ఆసక్తి చచ్చిపోతోంది. ఒకప్పుడు షూటింగ్ స్పాట్‌లో నటులను చూడటమే గగనంగా ఉండేది, కానీ ఇప్పుడు అంతా బహిరంగంగా మారిపోయింది" అని ఆయన విమర్శించారు.

'రేజర్'లో అంతా నేచురల్

అయితే, తన తాజా చిత్రం 'రేజర్' విషయంలో పూర్తి భిన్నమైన పంథాను అనుసరించినట్లు రవిబాబు తెలిపారు. ఈ సినిమాలో ఏ ఒక్క సన్నివేశంలోనూ డూప్ ను వాడలేదని, ఫైట్ సీక్వెన్స్‌లను చాలా సహజంగా, వాస్తవికతకు దగ్గరగా చిత్రీకరించామని స్పష్టం చేశారు. తనీష్, బెనర్జీ కీలక పాత్రలలో నటించిన ఈ చిత్రాన్ని సురేశ్ బాబు సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మించారు. వినూత్న కథాంశంతో రాబోతున్న ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. రవిబాబు వ్యాఖ్యల నేపథ్యంలో 'రేజర్'లో ఆయన చెప్పిన సహజత్వం ఎలా ఉంటుందో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# అషు రెడ్డి కేసులో ఆడియో లీక్.. ధర్మేంద్రకు వార్నింగ్!

**పెళ్లి పేరుతో రూ.9 కోట్లు మోసం చేశారంటూ అషు రెడ్డిపై ఆరోపణలు**

**కేసులో కీలకమైన ఆడియో టేపులు ఆన్‌లైన్‌లో లీక్**

**బాధితుడు ధర్మేంద్రకు వార్నింగ్ ఇస్తున్నట్లుగా ఉన్న ఆడియో**

**కోటిన్నర తిరిగిస్తా.. మిగతాది తర్వాత చూస్తానంటూ ఆడియోలో సంభాషణ**

నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అషు రెడ్డిపై నమోదైన చీటింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితుడైన ఎన్నారై ధర్మేంద్రను అషు రెడ్డి హెచ్చరిస్తున్నట్లుగా చెబుతున్న ఓ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. ఇదే సమయంలో, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ అషు రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. లీకైన ఆడియో ప్రకారం.. ధర్మేంద్ర నుంచి తీసుకున్న డబ్బులో రూ. 1.5 కోట్లను మే నెలలో తిరిగి ఇస్తానని, మిగిలిన మొత్తం తాను జీవితంలో స్థిరపడ్డాక చెల్లిస్తానని అషు రెడ్డి చెప్పినట్లుగా ఉంది. తన కుటుంబ సభ్యులను ఈ వివాదంలోకి లాగితే, వేధింపుల కింద ఎదురు కేసు పెడతానని హెచ్చరించినట్లు సమాచారం. నటి ప్రవీణ, జ్యోతిష్యుడు వేణు స్వామి మధ్యవర్తిత్వంలో ఈ విషయాన్ని పరిష్కరించుకుందామని కూడా ఆ ఆడియోలో ప్రస్తావించినట్లు వార్తలు వస్తున్నాయి.లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ధర్మేంద్ర అలియాస్ వెంకట్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అషు రెడ్డి 2018 నుంచి సుమారు రూ. 9.35 కోట్లు, 5 కిలోల బంగారం, లగ్జరీ కార్లు, ఫ్లాట్లు తీసుకున్నారని ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అషు రెడ్డి, ఆమె కుటుంబ సభ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తాజా పరిణామాలతో అషు రెడ్డి ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, ఈ ఆడియో టేపుల వాస్తవికతను పోలీసులు ఇంకా ధృవీకరించలేదు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com